


ఆరోగ్య విజయదశలు

న్యూస్‌టుడే, కర్నూలు వైద్యాలయం

చెడుపై విజయం సాధించడమే 'దశ'హరా పండగ.. వ్యవహారంలో దసరాగా స్థిరపడింది.. రామాయణ, మహాభారత ఇతిహాసాల్లోనూ పండగకు సంబంధం కనిపిస్తుంది. రామచంద్రమూర్తి రాక్షస సంహారం చేసి రావణుడిపై విజయం సాధించిన దినంగా రామాయణంలో ప్రస్తావించారు. పాండవులు ధర్మానికి కట్టుబడి అరణ్య, అజ్ఞాతవాసాలు పూర్తి చేసుకుని కౌరవ సంహారానికి ఉద్యుక్తులవుతూ విజయ సాధన కోసం జమ్మి చెట్టు మీద దాచిన తమ ఆయుధాల్ని కిందికి దించిన దినంగా విజయదశమిని భావిస్తారని మహాభారతంలో ప్రస్తావించారు.

శరదృతువులో తెల్లికైనట్లు... సమస్యా మేఘావృతమైన మనసు విఘ్నేశ్వరుని ఆరాధనతో ఆపదల్ని తొలగించుకుని శరత్కాల మేఘంలాగా స్వచ్ఛమైన, తెల్లికైన మనసుతో అందరమ్మ ఆరాధనకు సన్నద్ధమవుతున్నవేళ ఇది. ఈ శుభ తరుణంలో అమ్మవారి వైభవాన్ని కీర్తించుకోవడానికి నవరాత్రులు నిర్వహిస్తాం.. నవరాత్రులు అంటే తొమ్మిది రాత్రులే కాదూ.. తొమ్మిది పగళ్లు. అని కూడా అర్థం. తొమ్మిది రాత్రుల తర్వాత వచ్చే పగలే విజయదశమి.

అమ్మవారు మహిషాసురుడిని సంహరించిన రోజు.. దశ దుర్గుణాలు సంహరించినందుకు ఈ పేరు వచ్చింది. బద్ధకం.. అతిగా తినడం.. కాలు కదపకపోవడం.. 'మత్తు'కు బానిస కావడం.. సామాజిక మాధ్యమాల్లో గంటల తరబడి గడపటం.. వంటి దుర్గుణాలను అంతమొందించుకోవడానికి ఓ లక్ష్యం పెట్టుకుందాం... దసరా నుంచే తొలి అడుగు వేద్దాం.!!

నిత్యం ఎంత శక్తి అవసరం
రోజువారీ అవసరాలకు ఆరోగ్యకరమైన వ్యక్తికి 2,600-2,800 కిలో క్యాలరీల వరకు, మహిళలకైతే 2,200-2,400 వరకు సరిపోతాయి.

1. షాపింగ్ మాల్స్‌కు వెళ్లినప్పుడు ఐదు నిమిషాలపాటు మెట్లపై నడిస్తే 51 క్యాలరీలు వరకు ఖర్చవుతాయి.

2. కూర్చొని ఫోన్ మాట్లాడే బదులు గది, బాల్కనీ మేడపై నడుస్తూ మాట్లాడటం మంచిది.

3. టీవీ చూసే సమయంలో రిమోట్‌ను దూరంగా పెట్టండి. ఛానల్ మార్చాలనుకున్నప్పుడల్లా వెళ్లి తెచ్చుకోండి.

4. షవర్ స్నానం కాకుండా బకెట్‌లోని నీటిని మగ్‌తో తీసుకుని స్నానం చేయడం వల్ల మరికొన్ని క్యాలరీలు ఖర్చవుతాయి.

5. ఒకట్రెండు అంతస్తుల వరకు ఎక్కాలంటే లిఫ్ట్‌లో వెళ్లకుండా మెట్ల మార్గాన్నే ఉపయోగించండి. ఆరోగ్యానికి మేలు చేకూరుతుంది.

6. నిత్యం 30 నిమిషాలు సైకిల్ తొక్కడం వల్ల దాదాపు 75 నుంచి 670 అదనపు క్యాలరీలు ఖర్చవుతాయట.

7. స్నానం చేసేటప్పుడు పాటలు పాడితే అదనంగా 42 క్యాలరీలు ఇట్టే కరిగిపోతాయి.

8. ఛలోక్తి విసిరినప్పుడు హాయిగా నవ్వుకోండి. టీవీలో హాస్య సన్నివేశాలు చూసి గట్టిగా నవ్వండి.

9. కంప్యూటర్ ముందు విధులు నిర్వహించే వారు మధ్యమధ్యలో లేచి నిల్చుండటం... నడవటం వంటివి చేయాలి

10. ఉదయం పళ్లు తోముకునే సమయంలో ఒంటి కాలిపై నిల్చోవాలి.

ఆరోగ్య సిరి సంపదలు

✦ నిత్యం మనిషికి అవసరమైన పీచు పదార్థం (ప్రతి ఒక్కరికీ రోజుకు 38 గ్రాములు అవసరం) సిరి ధాన్యాల నుంచే లభిస్తుంది. మిగిలిన 10 గ్రాములు కూరగాయలు, ఆకుకూరల నుంచే లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

✦ డబ్ల్యూహెచ్‌వో, ఐసీఎంఆర్ లెక్కల ప్రకారం ఒక వ్యక్తికి పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు రోజుకు 400 గ్రాములు, బియ్యం 190 గ్రాములు, పప్పు ధాన్యాలు 40 గ్రాములు అవసరమవుతాయి.


✦ ఐదుగురు వ్యక్తులున్న కుటుంబానికి 200 గ్రాముల పప్పుధాన్యాలు, రెండు పూటలకు కిలో బియ్యం, అర కిలో పండ్లు, కిలోన్నర కూరగాయలు, ఆకుకూరలు కావాలి.

ఎండు ఫలం ఎంతో మధురం

ఎండు ఫలాలు తినేవారి సంఖ్య పెరగడంతో కర్నూలు, నంద్యాల పట్టణాల్లో పెద్ద దుకాణాలు వెలుస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి రకరకాల ఎండు ఫలాలు తెప్పిస్తున్నారు. జీడిపప్పును గోవా నుంచి, ఆల్మండ్స్ (బాదం), పిస్తా కాలిఫోర్నియా, ఎండు ద్రాక్ష, అంజీరాను ఆఫ్ఘనిస్తాన్, ఖర్జూరాలో అజ్వ రకం, మెడ్జల్ రకాలను సౌదీ అరేబియాలోని మదీనా నుంచి తెప్పించి ఇక్కడ విక్రయిస్తున్నారు. ఆల్‌మండ్స్ మమ్రా ఇరాన్ నుంచి, ఆప్రికాట్ బోల్ట్ (ఖుబానీ) టర్కీ, వాల్‌నట్స్, వాల్‌నట్ షెల్స్ కశ్మీర్ నుంచి, పొమేలా (ఎండిన నారింజ పండు) ఏషియన్ ఫ్రూట్స్‌ను మలేషియా, ఇండోనేషియా, శ్రీలంక దేశాల నుంచి, బ్లూ బెర్రీస్ యూరప్ నుంచి, గోల్డెన్ కివీ డ్రైడ్, గువా డ్రైడ్ (ఎండిన జామ) మన దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి, కుంకుమ పువ్వు, జాపత్రి కశ్మీర్ నుంచి దిగుమతి చేసుకొంటున్నారు.

తెగ తినేస్తున్నారు

జంక్‌ఫుడ్ లేనిదే రోజు గడవడం లేదు. ఉమ్మడి జిల్లాలో చాలా మంది 3 వేల నుంచి 4 వేల క్యాలరీలు ఒంట్లోకి పంపిస్తున్నారు. పండగ వేళ పిండివంటలు, మిఠాయిలతో మరిన్ని క్యాలరీలు ఒంట్లోకి వెళ్లనున్నాయి.



ఎంత తింటున్నామో

(జాతీయ పోషకాహార సంస్థ ప్రకారం)

పదార్థం	పరిమాణం	కిలో క్యాలరీలు
సమోసా	1	200
బర్ఫీ	2 ముక్కలు	400
హల్వాకేసరి	అరకప్పు	320
ఐస్‌క్రీం	అరకప్పు	200
బర్గర్	1	260
పిజ్జా	1 ముక్క	250

క్యాలరీలు ఖర్చు చేయాలండీ

అదనపు క్యాలరీలను ఎప్పటికప్పుడు సరిచేయకపోతే శరీరంలో వేర్వేరు భాగాల్లో కొవ్వు పేరుకుపోతుంది. దీంతో బొజ్జ పెరగడం, ఊబకాయం వంటి సమస్యలు చుట్టుముడతాయి. చాలా మంది బద్ధకంతో వ్యాయామాన్ని వాయిదా వేస్తుంటారు. ఫలితంగా టైప్-2 మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధుల బారినపడే ప్రమాదాలు కొన్ని తెచ్చుకుంటున్నారని కర్నూలు సర్వజన ఆసుపత్రి న్యూట్రీషియన్ రవీంద్ర తెలిపారు. క్యాలరీలను తగ్గించుకొనే కొన్ని చిట్కాలను అందించారు.



పండగ పిలిచింది

దసరా నేపథ్యంలో కర్నూలు బస్టాండ్ శుక్రవారం ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. తమ స్వప్రాంతాలకు వెళ్లేందుకు జనం భారీగా తరలివచ్చారు. ఫలితంగా బస్టాండ్ ప్రాంగణం కిటకిటలాడింది. బస్సు రాగానే సీట్ల కోసం కుస్తీ పడ్డారు. రద్దీకి తగ్గట్టు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలువురు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది.

– ఈనాడు, కర్నూలు

ధరకాసులు

జిల్లాలో మద్యం దుకాణాల అనుమతులకు దరఖాస్తుల స్వీకరణ శుక్రవారం ముగిసింది. 99 దుకాణాలకు 3,013 దరఖాస్తులు వచ్చాయి. డీడీలు తీసుకుని ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఆబ్కారీ స్టేషన్లకు వచ్చినవారికి అర్ధరాత్రి వరకు అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశముంది. దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి రూ. 60.26 కోట్ల ఆదాయం సమకూరడం విశేషం.

సీనియర్ సహాయకుడిపై విచారణ

ఈనాడు కథనానికి స్పందన

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : 'భూ మార్పిడి.. కాసుల కావడి' శీర్షికన 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ పి. రంజిత్ బాషా స్పందించారు. సమగ్రంగా విచారించాలంటూ కర్నూలు ఆర్డీవో కిడారి సందీప్‌ను ఆదేశించారు. వచ్చే సోమవారం విచారణ జరిపి సమగ్ర నివేదికలు అందించాలని సూచించారు.



విజయదశమి శుభాకాంక్షల ప్రత్యేక అనుబంధం నేటి సంచికతో ఉచితంగా అందుకోగలరు.



అశ్వవాహనంపై కొలువైన స్వామిఅమ్మవారు

విజయ సిద్ధిదాయిని

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాల సందడి అంబరాన్నంటుతోంది. ఉత్సవాల తొమ్మిదో రోజు శుక్రవారం భ్రమరాంబాదేవి భక్తులకు సిద్ధిదాయిని అలంకారంలో దర్శనమిచ్చారు. అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను అశ్వవాహనంపై అధిష్ఠింపజేసి, పుష్పార్చనలు చేసి మంగళహారతులు సమర్పించారు. ఉత్సవం వద్ద కళాకారులు పలు రకాల సంప్రదాయ నృత్యాలు చేసి సందడి చేశారు.

మంత్రి ప్రత్యేక పూజలు

దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దంపతులు మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన నిర్వహించారు. అర్చకులు వేదాశీర్వచనాలు పలుకగా, స్వామివార్ల జ్ఞాపికలను కమిషనర్ అందజేశారు.



అశ్వాల పార్వేట.. సంప్రదాయ వేడుక

దసరా వేడుకల్లో మద్దికెర అశ్వాల పార్వేట రాష్ట్రంలో ప్రత్యేకతను సంతరించుకుంది. మద్దికెరను పాలించిన పాలెగాళ్లు యాదవ రాజుల వంశీకుల కుటుంబాల వారు గ్రామంలో వందల ఏళ్లుగా పార్వేట సంప్రదాయం కొనసాగిస్తున్నారు. శనివారం జరిగేగుర్రాల పరుగు పందేనికి యాదవరాజ వంశీయులు సిద్ధమవుతున్నారు. అశ్వాలను స్థానిక బోజరాజు బావి వద్దకు ఊగరేగింపు తీసుకువెళ్లి వాటికి స్నానాలు చేయించడంతో ఈ వేడుక మొదలవుతుంది. సాయంత్రం 4 గంటలకు వారి వారి గృహాల నుంచి సంప్రదాయ దుస్తులు ధరించిన యువకులు గుర్రాలపై మంది, మార్బలం ఆయుధాలతో మూడు కి.మీ. దూరంలోని బొజ్జనాయునిపేట గ్రామానికి తరలివెళ్తారు. బొజ్జనాయునిపేట గ్రామంలో రాజవంశీయులు నిర్మించిన బోగేశ్వరాలయానికి చేరుకున్న మూడు వర్గాల వారు పూజలు నిర్వహిస్తారు. అనంతరం అక్కడి నుంచి పోటీలు ప్రారంభం అవుతాయి. పార్వేట మిట్టను ఎవరు ముందుగా చేరుకుంటారో వారే ఈ ఏడాదికి విజేతలుగా నిలుస్తారు. ఈ వేడుకను తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతారు.

మద్దికెర, న్యూస్‌టుడే:

దేవరగట్టు.. భక్తులదే పట్టు



దసరా అనగానే గుర్తొచ్చేది దేవరగట్టు 'కర్రతాళ' ధ్వనులు.. మాళ మల్లేశ్వరస్వామి దసరా 'బన్ని జైత్రయాత్ర' శనివారం అర్ధరాత్రి ప్రారంభమవుతుంది. . 800 అడుగుల ఎత్తైన కొండపై వెలసిన స్వామి ఉత్సవమూర్తులను దక్కించుకునేందుకు కర్రలతో తలపడతారు.. 13న ఉదయం దైవ కార్ణీకం (భవిష్యవాణి) అనంతరం మరోమారు ఆయా గ్రామాల భక్తులు ఉత్సవమూర్తుల కోసం కర్రలతో తలపడతారు. 14న స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. 15న గొరవయ్యల ఆట, గొలుసు తెంపుట, వసంతోత్సవం, సాయంత్రం కంకణ విసర్జన చేస్తారు. 16న ఉత్సవమూర్తులు నెరణికి గ్రామం చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

–హాలహర్వి, హొళగుంద, న్యూస్‌టుడే:

యువ సాహస పండగ



ఆయుధ పూజ.. దుర్గమ్మకు మొక్కులు.. కమ్మనైన వంటలు.. చిన్నారుల ఆటలు.. బంధువుల రాక.. విజయం కలగాలని శమీ పూజలు దసరాకు మనకు కనిపించే సందడి.. ఎమ్మిగనూరు మండలం గుడేకల్లులో 'యువ' విన్యాసాలు అలరిస్తాయి. కత్తులపై పడుకొని బండలు పగులకొట్టడం.. నోటితో వాహనాలను లాగడం.. ఇనుప చువ్వలు గుచ్చుకొని వాహనాలను లాగడం.. ఎద్దుల బండ్లను జుట్టుకు కట్టుకొని తీసుకెళ్లడం వంటి ఒళ్లు గగుర్పొడిచే సాహసాలతో ఆకట్టుకుంటారు.. ఈ వేడుక చూసేందుకు యువత పెద్దఎత్తున తరలొస్తారు.

– ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే:

ప్రతి కుటుంబానికి విజయాలు కలగాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : అమ్మవారి అనుగ్రహంతో జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా పండగ చేసుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్ శుక్రవారం ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకొనే విజయదశమి పండగ సందర్భంగా రాష్ట్రం, జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ప్రతి కుటుంబానికి విజయాలు లభించాలని కోరారు.

✦ విజయదశమి సందర్భంగా జిల్లా ప్రజలు సంతోషంగా ఉండాలంటూ కలెక్టర్ పి.రంజిత్ బాషా శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబానికి విజయాలు సిద్ధించాలని, జిల్లా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

99 దుకాణాలు.. 3,013 దరఖాస్తులు

- ముగిసిన మద్యం అనుమతుల ప్రక్రియ
- దరఖాస్తులతో ప్రభుత్వానికి రూ.60.26 కోట్ల ఆదాయం



నగరంలోని జిల్లా మద్య నిషేధ, అబ్కారీ శాఖ కార్యాలయంలో దరఖాస్తుల ప్రక్రియను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, పర్యవేక్షణాధికారి సుధీర్‌బాబు తదితరులు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లాలో మద్యం దుకాణాల అనుమతులకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం ముగిసింది. చివరిరోజు 550కు పైగా దరఖాస్తులు వచ్చాయి. గతంలో ఎప్పుడూ లేనివిధంగా.. అధికారుల అంచనాకు తగ్గట్టు స్పందన వచ్చింది. శుక్రవారం రాత్రి 7 గంటల వరకు నమోదైన దరఖాస్తుల ప్రక్రియ పరిశీలిస్తే సగటున ఒక్కో దుకాణానికి 30 వరకు వచ్చాయి. దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు విధించారు. ఈ మొత్తం వెనక్కి ఇవ్వరు. కర్నూలు స్టేషన్ పరిధిలోనే పోటీ ఎక్కువగా ఉంది. దరఖాస్తుల నమోదు ప్రక్రియ సజావుగా జరగటంతో మద్య నిషేధ, అబ్కారీ శాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, కర్నూలు పర్యవేక్షణాధికారి సుధీర్‌బాబు నిరంతరం పర్యవేక్షించారు.

స్టేషన్	దుకాణాలు	దరఖాస్తులు	సగటున ఒక్కో దుకాణానికి వచ్చిన దరఖాస్తులు
కర్నూలు	31	1,427	46
కోడుమూరు	14	508	36
ఆదోని	12	247	20
ఆలూరు	9	186	20
ఎమ్మిగనూరు	15	296	15
కోసిగి	4	53	13
పత్తికొండ	14	296	21

14న లక్కీడిప్

దరఖాస్తుల ఖరారు ప్రక్రియకు సంబంధించిన లక్కీడిప్ కార్యక్రమం 14వ తేదీన కర్నూలులోని జడ్పీ సమావేశం హాలులో జరుగుతుంది. దీనికి సంబంధించి మద్య నిషేధ, అబ్కారీ శాఖ అధికారులు అన్నీ ఏర్పాట్లు ప్రారంభించారు. గేటు పాసు ఉన్నవారిని మాత్రమే జడ్పీ హాలులోకి అనుమతించనున్నారు. లక్కీడిప్‌లో అనుమతి దక్కించుకున్న దరఖాస్తుదారుడు వార్షిక రుసుములో 6వ వంతు అక్కడే చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అనుమతులు పొందినవారు 15వ తేదీ నుంచి దుకాణాలు ఏర్పాటు చేసుకుంటారు. లక్కీడిప్ కార్యక్రమంపై దరఖాస్తుల్లో ఉత్కంఠ నెలకొంది.

నంద్యాల జిల్లాతో పోల్చితే..

నంద్యాల జిల్లాతో పోల్చితే కర్నూలు జిల్లాలో మద్యం దుకాణాల సంఖ్య తక్కువ. కర్నూలు జిల్లాలో 99 మద్యం దుకాణాలు ఉండగా.. నంద్యాల జిల్లాలో 105 ఉన్నాయి. అయినప్పటికీ కర్నూలు జిల్లాలో 3,013 దరఖాస్తులు రాగా.. నంద్యాల జిల్లాకు 2,115 మాత్రమే రావడం గమనార్హం. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందినవారు కర్నూలు జిల్లా పరిధిలోని దుకాణాలకు అత్యధికంగా దరఖాస్తు చేసుకోవడమే ప్రధాన కారణం.

రాజకీయ పెత్తనం

మద్యం దుకాణాల అనుమతుల విషయంలో నాయకులు పెత్తనం చెలాయిస్తున్నారు. కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో దరఖాస్తుదారులపై అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు ఎక్కువగా ఉన్నాయి. అధికార పార్టీ నేతల సిఫారసులతో బదిలీలపై వచ్చి నియమితులైన పోలీసు, మద్య నిషేధ అబ్కారీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అనుమతుల దక్కించుకున్న వారిని బెదిరించైనా లొంగదీసుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దరఖాస్తు చేసుకున్నవారి వివరాలను నాయకులు తెలుసుకుని వారికి ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ఆకూవక్కలతో అవ్వకు అలంకరణ

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని మహాయోగి లక్ష్మమ్మవ్వకు తమలపాకులు, వక్కలతో శుక్రవారం అలంకరించారు. దసరా శరన్నవరాత్రులు పురస్కరించుకుని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకుంటున్నారు.



తమలపాకులు, వక్కల అలంకరణలో మహాయోగి లక్ష్మమ్మవ్వ

రైతులకు చేయూత అవసరం

కర్నూలు (వెంకటరమణ కాలనీ), న్యూస్‌టుడే : పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, రైతు సంఘం మండల నేత మహేష్ అన్నారు. నగరంలోని సీఆర్ భవన్‌లో వారు శుక్రవారం మాట్లాడారు. మిరపకు తెగుళ్ల సోకడం.. పత్తి ధరలు తగ్గడంతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న పంట నష్టపరిహారం డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

వైద్య కళాశాలను తక్షణమే ప్రారంభించాలి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోనిలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు తక్షణమే పూర్తి చేసి, తరగతులు ప్రారంభించాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండు చేశారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం అందించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సాబీర్‌బాషా, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, సోమశేఖర్, డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనరు రమేశ్, ఎన్ఎస్‌యూఐ డివిజన్ అధ్యక్షుడు బాలు, డీవైఎఫ్ఐ నాయకులు గోవిందరాజులు మాట్లాడారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువచేయాలన్నారు.

పల్లె కబుర్లు

పగిడిరాయి (తుగ్గలి), న్యూస్‌టుడే: పగిడిరాయి గ్రామంలో కోట వెనుక సుంకలమ్మకు భక్తులు అందజేసిన వెండి ముఖం తొడుగు, రాగి నాగపడగలను శుక్రవారం గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పూజారి హనుమంతు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జొన్నగిరి (తుగ్గలి), న్యూస్‌టుడే: జొన్నగిరి విద్యుత్తు ఉప కేంద్రంలో శుక్రవారం ఆయుధ పూజ నిర్వహించినట్లు ట్రాన్స్‌కో ఏఈ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. జొన్నగిరి ఠాణాలో జరిగిన పూజలో ఎస్సై జయశేఖర్ పాల్గొని పూజలు చేశారు.

నారాయణపురం (ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో శనివారం నుంచి మూడు రోజులపాటు దసరా ఉత్సవాల్లో భాగంగా గర్జి లింగేశ్వరస్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు భక్త మండలి సభ్యులు తెలిపారు. గర్జి లింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, బన్ని మంకాలమ్మ పూజ, స్వామివారి ఊరేగింపు, బీరప్ప డోళ్లు, గొరవయ్యలు, కోలాట ప్రదర్శన ఉంటాయన్నారు. దేవాలయాలను విద్యుద్దీపాలంకరణ చేశారు.

ఎంపీపీ సంతకం లేకుండా నిధుల మంజూరా?

చిప్పగిరి, న్యూస్‌టుడే: మండల ప్రత్యేక సమావేశం నిర్వహించలేదు.. ఎంపీపీ సంతకం చేయలేదు.. మండలాభివృద్ధి నిధులకు తీర్మానం ఊసే లేదు. కానీ సమావేశం జరిగిపోయినట్లు చేశారని ఎంపీపీ జూటూరు హేమలత కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్లు శుక్రవారం తెలిపారు. ఆగస్టు 24వ తేదీన తన అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి తీర్మానం చేసినట్లు ప్రతిపాదనలు పంపారని, చిప్పగిరి మండలానికి ఉపాధి హామీ పథకం కింద రూ.1.80 కోట్లు మంజూరు చేశారన్నారు. తీర్మాన పత్రంపై ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాసులు సంతకం మాత్రమే ఉందన్నారు. తనకు తెలియకుండా తీర్మానం చేసి, ఎంపీపీ సంతకం లేకుండా పంపడం ఏమిటని ఆమె అధికారులను ప్రశ్నించారు. తనకు తెలియకుండా ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయడమేంటని ఆమె ప్రశ్నించారు. పనులు రద్దు చేసి, కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా అధికారులను ఆమె కోరారు.

శక్తిరూపిణి.. విజయధాత్రి


మద్దికెర: విద్యుత్తు ఉపకేంద్రంలో ఆయుధ పూజ వేడుకల్లో ఎస్ఈ ఉమాపతి, ఏఈ రఫీక్, లైన్‌ఇన్‌స్పెక్టర్ వీరరాజు, లైన్‌మెన్, సిబ్బంది


పత్తికొండ పట్టణం: గుమ్మడికాయల కొనుగోలు


పత్తికొండ పట్టణం: పత్తికొండ పోలీసు స్టేషన్‌లో ఆయుధ పూజలో పాల్గొన్న శిక్షణ డీఎస్పీ ఉషశ్రీ, పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జయన్న

శరన్నవరాత్రి వేడుకల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. పలు చోట్ల మండపాలు ఏర్పాటు చేసి, అమ్మవారి ప్రతిమలకు పూజలు నిర్వహించారు. ఆలయాలను ఆకర్షణీయంగా అలంకరించారు. విద్యుత్తు దీపాల వెలుగుల్లో మెరిసిపోయాయి. ఆలయాల వద్ద అన్నదానాలు చేపట్టారు. ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని మండలాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

– న్యూస్‌టుడే బృందం




ఆదోని నగరేశ్వరస్వామి ఆలయంలో మహాచండీ హోమం


ఆస్పరి: రామతీర్థంలో మహిషాసురమర్దినిగా గాయత్రీదేవి


ఆదోని గ్రామీణం: నెట్టెకల్‌లో దుర్గాదేవిగా దొండు మారెమ్మ


ఆదోని పాతపట్టణం: నగరేశ్వరస్వామి ఆలయంలో ధనలక్ష్మిగా వాసవిదేవి


ఆదోని ఎస్కేడీ కాలనీ: విజయ దుర్గా దేవిగా అంబాభవాని


ఆలూరు: నవ దుర్గాదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

రామలీలా వేడుకలు నేడు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని పోరెడ్డివీధిలో అంబాభవానీ ఆలయం ఆవరణలో శనివారం రామలీలా వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అమ్మవారి రథోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో రావణ, కుంభకర్ణ భారీ విగ్రహాలను దహన కార్యక్రమం నిర్వహించనున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80065 62277 పత్తికొండ: 8008573822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: సమస్య: ఆదోని రైల్వేస్టేషన్‌లో నాలుగో ప్లాట్‌ఫాంపై వర్షం నీరు నిల్వ స్తోంది. పారిశుద్ధ్య, ప్రయాణికులు రైలు ఎక్కి, దిగే విషయంలో జారిపడుతున్నారు. నీరు నిల్వకుండా చూసుకోవాలి. - నసీరుద్దీన్‌పటేల్, ఆదోని

సమాధానం: త్వరలో ప్లాట్‌ఫాంపై షెడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నాం. వర్షం నీరు నిల్వ లేకుండా చేస్తాం. - వెంకటేశ్వర్లు, ఆదోని రైల్వేస్టేషన్ మేనేజరు

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: పత్తికొండ బస్టాండ్ ప్రాంగణంలో పందులు సంచరిస్తున్నాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. - ప్రయాణికులు

సమాధానం: సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయి బస్టాండ్ నుంచి పందులు తరలించే మార్గం చేస్తాం. - పత్తికొండ ఇన్‌ఛార్జి డిపో మేనేజర్

చిప్పగిరి, న్యూస్‌టుడే: సమస్య: ఖాజీపురంలో మురుగు కాల్వలు లేక అవస్థలు పడుతున్నాం. మురుగు కాల్వలు, సీసీ రహదారులు నిర్మించాలి. - నాగరాజు, ఖాజీపురం

సమాధానం: సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు రాగానే మరమ్మతు చేస్తాం. - రమాదేవి, సర్పంచి ఖాజీపురం

హొళగుంద, న్యూస్‌టుడే: సమస్య: ముద్దటమాగి గ్రామంలో మినీ ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దోమల బెడదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. - నేలకప్ప, ముద్దటమాగి

సమాధానం: పారిశుద్ధ్య పనులు చేపట్టి పరిష్కరిస్తాం. - షఫీ, పంచాయతీ కార్యదర్శి, ముద్దటమాగి

సమస్య: దేవనకొండలోని పాత సినిమా టాకీస్ కాలనీలో చెట్టు కొమ్మలపై విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రమాదాలు జరుగుతాయోనని ఆందోళన చెందుతున్నాం. - ప్రకాశ్, కాలనీవాసి

సమాధానం: విద్యుత్తు తీగలపై ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి సమస్య పరిష్కరిస్తాం. - రంజాన్, లైన్‌మెన్, దేవనకొండ

ఆలూరు, న్యూస్‌టుడే: సమస్య: కోయనగర్ కాలనీకి వెళ్లే మార్గంలో రహదారి పక్కన చెత్త చెదారం పేరుకుపోయింది. ఇటు వైపు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నాం. చెత్త తరలించేలా చూడాలి. - నాగేంద్ర, ఆలూరు

సమాధానం: గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి వెంటనే చెత్త తొలగించి పరిసరాలు శుభ్రం చేయిస్తాం. - ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి, ఆలూరు

ఆస్పరి, న్యూస్‌టుడే: సమస్య: బిల్లేకల్లు గ్రామంలోని కొత్తకాలనీల్లో సీసీ రహదారి లేక వర్షం వస్తే బురదగా మారి నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నాం. - ఈశ్వరప్ప, చంద్ర, బిల్లేకల్లు

సమాధానం: గ్రామాల్లోని కొత్త కాలనీల్లో సీసీ రహదార్లు, మురుగు కాల్వల ఏర్పాటుకు ప్రతి పాదనలు పంపాం. నిధులు మంజూరైతే పనులు చేయిస్తాం. - గీతావాణి, ఎంపీడీవో, ఆస్పరి

తేలు కాటుకు యువకుడి మృతి

ఆస్పరి, న్యూస్‌టుడే: తేలు కాటుకు ఓ యువకుడు మృతి చెందినట్లు ఆస్పరి సీఐ మస్తాన్‌వలీ తెలిపారు. సీఐ, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆస్పరి గ్రామానికి చెందిన సిద్దమ్మ, వెంకటేశ్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు నవీన్ (16) తండ్రికి పొలం పనుల్లో చేదోడువాదోడుగా ఉంటున్నారు. ఈ నెల 9న పొలంలో ఆరబోసిన పత్తిని సంచుల్లో ఎత్తుతుండగా తేలు కాటేయడంతో ఆదోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు సీఐ పేర్కొన్నారు. నవీన్ తండ్రి వెంకటేశ్ దివ్యాంగుడు కావడంతో ఉన్న ఒక్కగానొక్క కుమారుడు ఆసరాగా ఉంటాడనుకుంటే మృతి చెందాడని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నిరంజన్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కురువ నాగన్న ఇంటి వద్ద ఖాళీ స్థలంలో పాతిపెట్టిన బండలను అదే గ్రామానికి చెందిన సిరికి రాజు, విక్రమ్, రవి, గిరి, రామాంజితోపాటు మరికొందరు పగులగొట్టి రూ.5 వేల నష్టం చేశారని ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రమాదాలపై గుర్రపు స్వారీ

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలో దసరా సంప్రదాయ వేడుకల సాధనలో శుక్రవారం అపశ్రుతి చోటుచేసుకుంది. యాదవరాజు వంశీయులు దసరా పండగ రోజున గుర్రాల పారువేట నిర్వహించడం ఇక్కడ సంప్రదాయం. ఇందుకు ముందస్తుగా శుక్రవారం సాయంత్రం యువకులు గుర్రపు స్వారీ సాధన చేపట్టారు. ఇందులో భాగంగా మద్దికెర- బొజ్జనాయునిపేట గ్రామాల మధ్య కొందరు యువకులు గుర్రాలపై స్వారీ చేస్తుండగా.. వెనుక ద్విచక్రవాహనాలపై వందలాది మంది యువకులు వాటి వెనుక వెళ్లారు. రహదారిపై పరిగెడుతున్న గుర్రం హఠాత్తుగా కింద పడిపోయింది. వెనుకనే వస్తున్న ద్విచక్రవాహనాలు ఒకదాన్ని మరొకటి ఢీకొని పడిపోవడంతో పదుల సంఖ్యలో యువకులు గాయపడ్డారు. ప్రమాదంలో గుర్రానికి కాలు విరిగిపోయింది. గాయపడిన యువకులను ఆసుపత్రికి తరలించారు. నెల కిందట గుర్రపు స్వారీ సాధన చేస్తున్న యువకుడు పృథ్వీరాజ్ ప్రమాదంలో గాయపడి మృతిచెందారు. ఇది మరవక ముందే మరోసారి ప్రమాదం జరగడంపై గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.


మద్దికెరలో గుర్రపు స్వారీ సాధనలో జరిగిన ప్రమాదంలో గాయపడిన యువకులు

ఆదోనిలో నకిలీ ఆర్టీవో అధికారుల అరెస్టు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో ఆర్టీవో అధికారులమని చెప్పి వాహన చోదకుల నుంచి డబ్బు వసూలు చేసిన ఇద్దరు నకిలీ ఆర్టీవో అధికారులను శుక్రవారం ఆదోని పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ శ్రీరామ్ తెలిపారు. స్థానిక ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లా నైక్కన్‌కూలి గ్రామానికి చెందిన డ్రైవరు సుబీష్, క్లీనర్ వినోద్ ఈ నెల 8వ తేదీన తెలంగాణ రాష్ట్రం తాండూర్‌కు లారీలో నాపరాళ్ల లోడుతో ఆదోని పట్టణం మీదుగా వెళ్తున్నారు. స్థానిక కొత్త బ్రిడ్జి వద్ద అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో అంబేడ్కర్ నగర్‌కు చెందిన యువకులు అశోక్‌కుమార్, వీరేశ్ లారీని ఆపారు. తాము ఆర్టీవో అధికారులమని చెప్పి లారీ తాళంచెవులు తీసుకున్నారు. రికార్డులు చూపించాలని బెదరించారు. లారీని వదలాలంటే రూ.లక్ష ఇవ్వాలని డిమాండు చేశారన్నారు. ఈ క్రమంలో లారీ డ్రైవరు సుబీష్‌పై దాడి చేయడంతో పాటు కీనర్ వినోద్‌కు చెందిన సెల్‌ఫోన్‌ను ధ్వంసం చేశారన్నారు. దీంతో లారీ డ్రైవరు సుబీష్ తన యజమాని రెజి అటికు ఫోన్ చేసి పరిస్థితి వివరించారు. నకిలీ ఆర్టీవో అధికారులు మాటవినకపోవడంతో లారీ యజమాని ఆన్‌లైన్‌లో ఫోన్ నెంబరు చూసి ఆదోని పోలీసులకు సమాచారం అందించారన్నారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీరామ్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని నకిలీ ఆర్టీవో అధికారులను అదుపులో తీసుకున్నారు. బాధితుడు సుబీష్ ఫిర్యాదు మేరకు అశోక్‌కుమార్, వీరేశ్‌ను అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

పండగకు దుస్తుల పంపిణీ

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులోని రాయనగర్‌లో అంధురాలైన రాములమ్మ కుటుంబాన్ని ఎమ్మెల్యే డా.పార్థసారథి శుక్రవారం సాయంకాలం పరామర్శించారు. ఎన్నికల ప్రచార సమయంలో ఎమ్మెల్యేతో కాలనీ సమస్యలు చెప్పుకొన్నారు. ఈ తరుణంలో ఎమ్మెల్యే నాటి నుంచి సోదరిగా భావిస్తూ గౌరవించుకుంటున్నారు. దసరా, దీపావళి పండగలు ఉండటంతో రెండు పండగలకు రెండు జతల నూతన దుస్తులు రాములమ్మకు అందించి యోగాక్షేమాలు తెలుసుకున్నారు.


నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డా.పార్థసారథి

ఇళ్లపై విద్యుత్తు తీగలు తొలగించాలి

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర సాయినగర్ కాలనీలో పలు ఇళ్ల మీదుగా ఉన్న 33-11కేవీ విద్యుత్తు తీగలను తొలగించి ఆదుకోవాలని స్థానికులు లైన్ ఇన్‌స్పెక్టర్ వీరరాజుకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం విద్యుత్తు ఉప కేంద్రానికి ఎస్ఈ ఉమాపతి వస్తున్నారని తెలుసుకున్న గ్రామస్థులు ఆయన్ని కలిసి తరలివచ్చారు. అయితే ఎస్ఈ రాక ఆలస్యం కావడంతో అక్కడే ఉన్న లైన్ ఇన్‌స్పెక్టర్‌ను కలిసి సమస్య విన్నవించారు. విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.


లైన్ ఇన్‌స్పెక్టర్ వీరరాజుకు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

బారులు తీరిన వాహనాలు

ఆదోని పట్టణం మీదుగా వెళ్లే 167వ జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాలు బారులు తీరాయి. దసరా పండగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లేందుకు వాహనాల్లో జనం అధిక సంఖ్యలో పయనమయ్యారు. బళ్లారి, రాయచూర్, శిరుగుప్ప, సింధనూరుతో పాటు పై ప్రాంతాలకు వెళ్లేందుకు పట్టణ దారులన్నీ కిక్కిరిసిపోయాయి. దీంతో గంటకు పైగా వాహన రాకపోకలు స్తంభించాయి. సాధరణ జనం, పాదచారులు సైతం ఇబ్బందులకు గురయ్యారు. ట్రాఫిక్ నియంత్రించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.


– న్యూస్‌టుడే, ఆదోని పాతపట్టణం

రద్దీ.. తప్పని ఇబ్బంది

ఆదోని మీదుగా వెళ్లే రైళ్లు రద్దీగా ఉండటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు తగ్గించడంతో సాధరణ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దసరా పండగ నేపథ్యంలో ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణాలు సాగిస్తున్నారు. తిరుపతి నుంచి నిజామాబాద్ వెళ్లే సూపర్‌ఫాస్ట్ రైలులో జనరల్ బోగీల్లో జనంతో నిండిపోయాయి. డోర్లు, మరుగుదొడ్ల వద్ద కూర్చుంటున్నారు. పైన, కింద కూర్చోవడంతో ఉక్కపోతతో గాలి ఆడక నరకం తప్పడం తప్పడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


– న్యూస్‌టుడే, ఆదోని మార్కెట్

రతన్ టాటాకు నివాళి

ఎమ్మిగనూరు గ్రామీణం, ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని సోమప్ప కూడలిలో శుక్రవారం వేదాస్ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా చిత్రపటానికి ఘనంగా నివాళి నిర్వహించారు. ఎంపీపీ కేశన్న, వేదాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. రతన్ టాటా పారిశ్రామిక రంగంలో వచ్చిన ఆదాయంలో అధిక శాతం దానం చేసిన గొప్ప మానవతావాది అన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది కాకర్ల చంద్రశేఖర్, మాచాని వెంకటేశ్వర్లు, ప్రభాకర్, షఫీవుల్లా పాల్గొన్నారు.

వైకాపా నిర్లక్ష్యంతో ప్రయాణికులకు ఇక్కట్లు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులు ఏర్పాటులో గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆదోని ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి అన్నారు. ఆదోని ఆర్టీసీ బస్టాండులో కొత్తగా అనంతపురం, కర్నూలు సర్వీసులకు సంబంధించిన మూడు సూపర్ లగ్జరీ బస్సులను శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆదోని ఆర్టీసీ డిపో పరిధిలో 17 నూతన బస్సులు ప్రారంభించామన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ సంస్థను అభివృద్ధి బాటలో నడిపిస్తూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డిపో ఇన్‌ఛార్జీ మేనేజరు అమర్‌నాథ్, ఎస్టీఐ రాఘవేంద్రప్రసాద్, ఎంఎఫ్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఉప కులాలకు న్యాయం చేయాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎస్సీ ఉప కులాలకు న్యాయం చేయాలని మాదాసి కురువ, మాదారి కురువ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు, ఎస్సీ కులాల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు గౌడ్ అన్నారు. ఆదోనిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగరాజు మాట్లాడారు. మాదాసి, మాదారి కురువలకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కులను అడ్డుకొనేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దేవేంద్రప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు బసవరాజు, మండల అధ్యక్షుడు మల్లి, నాయకులు లక్ష్మన్న, ముఖేష్, అనిమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సంకల్పం..

శిథిల గదులతో ఆటంకం

16 ఏళ్లుగా విద్యార్థుల అవస్థలు • పాఠశాల తరగతి గదుల్లోనే ఐటీఐ కళాశాల


శిథిలావస్థ భవనంలో కొనసాగుతున్న ఐటీఐ కళాశాల

విద్యార్థులు సాంకేతిక విద్యలో రాణించాలనే ఉద్దేశంతో 2008లో ఆలూరులో ఐటీఐ కళాశాల ఏర్పాటు చేశారు. కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన శిథిలావస్థ గదులు కేటాయించారు. ప్రస్తుతం కళాశాలలో డీజల్ మెకానిక్, ఎలక్ట్రిషియన్, సివిల్, కంప్యూటర్, డ్రస్ మేకింగ్, వెల్డర్ వంటి కోర్సుల్లో 240 మంది విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. సొంత భవనం లేకపోవడతో 16 ఏళ్లగా శిథిలావస్థకు చేరిన పాఠశాల అదనపు తరగతి గదుల్లోనే కొనసాగిస్తూ వస్తున్నారు. చిన్న పాటి వర్షం కురిసినా కొన్ని గదుల్లో నీరు కారుతోంది. దీంతో ఇబ్బందులు పడుతూనే విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు.


– న్యూస్‌టుడే, ఆలూరు

స్థలం ఉన్నా.. నిధులు సున్నా

పేద విద్యార్థులకు సాంకేతిక విద్య అందించాలన్న సర్కారు చేపట్టిన సంకల్పం సమస్యల్లో చిక్కుకుంది. ఐటీఐ కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో ఏళ్ల తరబడి చాలీ చాలని పాఠశాలల అదనపు తరగతి గదుల్లో నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఐటీఐ కళాశాలకు సొంత భవన నిర్మాణం కోసం నాలుగేళ్ల కిందట బళ్లారి వెళ్లే మార్గంలోని 2.35 ఎకరాల స్థలం సమకూర్చారు. భవన నిర్మాణం కోసం గతంలో రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. నిధులు మాత్రం సమకూర్చకపోయారు. దాంతో విద్యార్థులు శిథిల భవనంలోనే చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని ఏడాది క్రితం మరో సారి రూ.7.50 కోట్లతో నివేదికలు అదించారు. ఎలాంటి ఫలితం లేదు. ఏళ్ల తరబడి ఐటీఐ కళాశాల సొంత భవనం లేక శిథిలావస్థకు చేరిన పాఠశాల అదనపు తరగతి గదుల్లో కొనసాగుతున్నా ఇటు పాలకులు అటు అధికారులు పట్టించుకోవడం లేదు. వెనుకబడిన ప్రాంతానికి సాంకేతిక విద్యను చేరువచేయాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇప్పటికైనా స్పందించి భవన నిర్మాణానికి నిధులు సమకూర్చేలా చూడాలని విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులు కోరుతున్నారు.

పెవిలియన్ గదుల్లోనే..

పాఠశాలకు చెందిన తరగతి గదులు చాలకపోవడంతో రెండేళ్ల కిందట ఇండోర్ స్టేడియానికి చెందిన పెవిలియన్ భవనంలోని రెండు గదులు కేటాయించారు. రెండు గదుల్లో డీజిల్ మెకానిక్, సివిల్ వంటి కోర్సులకు చెందిన విద్యార్థులను కూర్చోబెట్టి చదువులు చెబుతున్నారు. గదులు చిన్నవిగా ఉండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. తప్పని పరిస్థితుల్లో అక్కడే చదువుకోవాల్సి వస్తోంది. ఇలా ఉండగా పెవిలియన్ భవనాన్ని ఖాళీ చేయాలని లేని పక్షంలో ప్రతి నెల అద్దె చెల్లించాలని సంబంధిత అధికారులు ఐటీఐ కళాశాలకు వచ్చి రెండు నెలల కిందట తాఖీదులు సైతం అందించారు. దాంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.


క్రీడా ప్రాంగణానికి చెందిన పెవిలియన్ భవనంలో నిర్వహిస్తున్న తరగతులు

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

రతన్ టాటాకు నివాళి


రతన్‌టాటా నివాళి అర్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఎమ్మిగనూరు గ్రామీణం, ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని సోమప్ప కూడలిలో శుక్రవారం వేదాస్ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా చిత్రపటానికి ఘనంగా నివాళి నిర్వహించారు. ఎంపీపీ కేశన్న, వేదాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. రతన్ టాటా పారిశ్రామిక రంగంలో వచ్చిన ఆదాయంలో అధిక శాతం దానం చేసిన గొప్ప మానవతావాది అన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది కాకర్ల చంద్రశేఖర్, మాచాని వెంకటేశ్వర్లు, ప్రభాకర్, షఫీవుల్లా పాల్గొన్నారు.

14 దుకాణాలకు 507 దరఖాస్తులు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారంతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసినట్లు ఆబ్కారీ శాఖ సీఐ మంజుల తెలిపారు. మొత్తం 14 మద్యం దుకాణాలకు 507 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 14న జడ్పీలో లక్కీడిప్ తీస్తారని ఆమె పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) ఎమ్మిగనూరు గ్రామీణం : 80085 73794 కోడుమూరు : 80085 73776

కోసిగి: సమస్య: కోసిగిలోని దుర్గమ్మ ఆలయం సమీపంలోని కాలనీలో మురుగు కాల్వలో పెద్దఎత్తున చెత్త పేరుకుపోయింది. రాత్రివేళల్లో చిన్న పిల్లలకు దోమలు కుడుతున్నాయి. నివారణ చర్యలు చేపట్టగలరు.
- రాజేశ్, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపించి మురుగు, చెత్తను తొలగిస్తాం. **- తిరుమలేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి**

వైభవంగా ఆయుధ పూజ

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్ల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆయుధ పూజ నిర్వహించారు. అలాగే మండలంలోని గాజులదిన్నె జలాశయం వద్ద ప్రాజెక్టు ఇంజినీర్ల సమక్షంలో విద్యుత్తు ఉపకేంద్రాల్లో సిబ్బంది ఆయుధ పూజలు చేశారు.


గోనెగండ్ల పోలీస్‌స్టేషన్‌లో పూజలు చేస్తున్న సీఐ గంగాధర్, పోలీసులు

కోడుమూరులో...

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు ఠాణాలో శుక్రవారం ఆయుధ పూజ నిర్వహించారు. ఏఎస్సై సురేంద్రబాబు ఆధ్వర్యంలో శక్తిమాత చిత్రపటాన్ని, పోలీసుల ఆయుధాలను అందంగా అలంకరించారు. అనంతరం ఆయుధాలకు పూజలు చేశారు.

సి.బెళగల్‌లో...

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్‌లోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఎస్సై తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. అలాగే బురాన్‌దొడ్డి, పోలకల్ గ్రామాల్లోని విద్యుత్తు ఉపకేంద్రాల్లో ఏఈ సుకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

నందవరంలో...

నందవరం, న్యూస్‌టుడే: నందవరం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఎస్సై శ్రీనివాసులు సమక్షంలో ఆయుధ పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు రాముడు, పరమేశ్, మల్లికార్జున, సోమశేఖర్, వీరేశ్, భాస్కర్, మల్లేశ్ పాల్గొన్నారు.


నందవరంలో పూజలు చేస్తున్న ఎస్సై శ్రీనివాసులు, పోలీసులు

మహిమాన్వితం.. మహిషాసుర మర్దిని


గూడూరు: వీరభద్ర స్వామి ఆలయంలో మహిషాసుర మర్దిని అలంకరణలో..


సి.బెళగల్‌లో మహిషాసురమర్దిని రూపంలో వాసవీమాత


కౌతాళం: ఉప్పరహాల్‌లో మహిషాసుర మర్దిని అలంకరణలో గ్రామ దేవత


మంత్రాలయం: మహిషాసుర మర్దినిగా అమ్మవారు


కౌతాళంలో చౌడేశ్వరీదేవి అమ్మవారు

ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో శుక్రవారం దుర్గాదేవి అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమార్చనలు, చండీ యాగం నిర్వహించారు. మంత్రాలయంలోని శ్రీమఠంలో పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు గ్రామ దేవత మంచాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. – న్యూస్‌టుడే బృందం


మంత్రాలయం: శ్రీమఠం మధ్వకారిడార్‌లో అమ్మవారిని ఊరేగిస్తున్న పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు, భక్తులు


ఎమ్మిగనూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో రూ.25 లక్షలతో ధనలక్ష్మి రూపంలో అమ్మవారు


నందవరం: సోమలగూడూరులో దుర్గాదేవి అలంకరణలో


గూడూరు గ్రామీణం: గూడూరులో తెలుగు వీధిలో అమ్మవారు


కోడుమూరు గ్రామీణం: అంభాభవాని ఆలయంలో...


మంత్రాలయం: రాఘవేంద్రపురంలో నిమ్మకాయలతో అలంకరించిన రేణుకా ఎల్లమ్మ


ఎమ్మిగనూరు: హెచ్‌బీఎస్ కాలనీలో గాయత్రీదేవి...


ఎమ్మిగనూరు గ్రామీణం: ఎమ్మిగనూరులోని చేనేత మైదానంలో మహిషాసుర మర్దినిగా...

చెత్తకుప్పలపై దోమల మందు

సూగూరు (మంత్రాలయం), న్యూస్‌టుడే: మురుగుకుంటలు, చెత్తకుప్పలపై దోమల నివారణ మందు స్ప్రే చేయించినట్లు కల్లుదేవకుంట పీహెచ్‌సీ వైద్యాధికారిణి గోవిందమ్మ తెలిపారు. మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన ఓ 8 నెలల చిన్నారికి డెంగీ అనుమానిత లక్షణాలు ఉన్నట్లు సమాచారం రావడంతో ఆమె వెంటనే శుక్రవారం సూగూరుకు వచ్చారు. పర్యవేక్షకుడు మాధవస్వామి, సబ్ యూనిట్ అధికారి నరసింహులు ఆధ్వర్యంలో ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్త లక్ష్మీకాంతమ్మ బాధిత ఇంటి పరిసరాల్లో దోమల నివారణ స్ప్రే చేయించారు.

బాధితురాలికి న్యాయం చేయండి


దీక్ష చేస్తున్న దళిత సంఘాల నాయకులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కల్లుకుంట గ్రామానికి చెందిన గోవిందమ్మకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని హైకోర్టు న్యాయవాది చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన ఎమ్మిగనూరులోని సోమప్ప కూడలిలో దీక్ష చేస్తున్న నాయకులకు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ఒక దళిత మహిళపై జరిగిన అన్యాయంపై స్పందించకపోవడం దారుణమన్నారు. దళిత మహిళను కొట్టిన వ్యక్తులపై కేసులు నమోదు చేయకుండా వదిలేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రాజు, రిషి, చిన్నరాజు బతకమ్మ, సునీల్‌కుమార్, ఆగ్రేశ్ పాల్గొన్నారు.

గుడేకల్లు.. గుండెజల్లు

◆ యువకుల సాహస ప్రదర్శనలు
◆ ఏటా దసరా సందర్భంగా వింత విన్యాసాలు


కొక్కేలతో గ్యాస్ సిలిండర్లు మోయడం (దాచిన చిత్రం)

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: దసరా పండగ వచ్చిందంటే ఎమ్మిగనూరు మండలం గుడేకల్లు యువకులు చేసే సాహస విన్యాసాలు గుర్తుకు వస్తాయి. ఏటా పండగను పురస్కరించుకుని వారిచ్చే ప్రదర్శనలు చూస్తే గుండెజల్లు మనడం ఖాయం. ఏటా వ్యాయామశాలలో సొంతంగా సాధన చేసి పండగ రోజు ప్రదర్శించడం ప్రత్యేకత.

గుడేకల్లు గ్రామంలో చింతమాను, రామమ్మ, గచ్చెల గారడీల పేరుతో వ్యాయామశాలలు నిర్వహిస్తారు. వ్యవసాయ పనులు, పాఠశాలలు, కళాశాలకు వెళ్లి వచ్చిన తర్వాత సాయంత్రం యువకులు ఈ వ్యాయామశాలల్లో సాధన చేస్తారు. ఏటా విజయదశమి రోజున గ్రామాల్లో ప్రదర్శలు ఇచ్చే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. శరీరానికి ఇనుప కొక్కేలు తగించుకుని బరువులెత్తడం, ఇంటి మిద్దెలపై నిచ్చెనలు కట్టి బండి చక్రం, బండలు, గ్యాస్ సిలిండర్లు, పొక్లెయిన్లతో కొక్కేలతో వేలాడటం వంటివి ప్రదర్శిస్తున్నారు. పడుకొని గాజులు ఎద మీద పెట్టుకుని సుత్తితో పగలగొట్టడం, గాల్లో ఎగురుతూ కొట్టడం, కర్రసాము చేయడం, వీపునకు కొక్కెం కట్టుకుని స్కూటర్ లాగడం, కళ్లు మూసుకుని ద్విచక్ర వాహనం నడుపుతూ ట్యూబ్‌లైట్లను పగులగొట్టడం, వీపునకు కొక్కేలు కట్టుకుని గ్యాస్ సిలిండర్లను లాగడం వంటి ఒళ్లు జలదరించే విన్యాసాలు ప్రదర్శిస్తారు.

వంద మందికిపైగా ప్రదర్శనలు

రెండు రోజులపాటు గ్రామంలో వంద మంది యువకులు ప్రదర్శనలు నిర్వహించనున్నారు. యువత దీనిపై ఎక్కువగా ఆసక్తి చూపుతారు. ముఖ్యంగా వీపునకు కొక్కేలు తగిలించుకుని ప్రదర్శిస్తారు. వీరిలో ఎక్కువగా డిగ్రీ చదివిన విద్యార్థులు సైతం ఉన్నారు. నిరంతరం సాధన చేస్తుంటారు.

ఏడేళ్లుగా సాధన చేస్తున్నా: ధనుంజయ, బీఏ



నేను డిగ్రీ పూర్తి చేశాను. ప్రస్తుతం పొలం పనులకు వెళ్తున్నాను. మా నాన్న గతంలో ప్రదర్శనలు ఇచ్చేవారు. నేను ప్రతిరోజూ సాయంత్రం వ్యాయామశాలకు వెళ్లి సాధన చేస్తున్నా. ఏడేళ్లుగా తంతిపై నడక, కర్రసాము, గ్యాస్ సిలిండర్లను వీపునకు కొక్కెంతో లాగడం, ద్విచక్ర వాహనం లాగడం, ట్యూబ్‌లైట్లు పగులగొట్టడం వంటి విన్యాసాలు చేశాను.

ఈ ఏడాది కొత్త విన్యాసాలు ప్రదర్శిస్తా: వెంకటేశ్, బీఏ



నేను డిగ్రీ చదివాను. ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్నా. దసరా వస్తే కొన్ని రోజుల ముందు నుంచి విన్యాసాల కోసం సాధన చేస్తుంటాను. ఇప్పటికే మూడు నెలలపాటు వివిధ అంశాల్లో తర్ఫీదు పొందా. ఎనిమిదేళ్లలో ఇనుక కొక్కేలు తగిలించుకుని బండ చక్రం లాగడం, ద్విచక్ర వాహనం, ట్రాక్టర్ లాగడం వంటి విన్యాసాలు చేశాను. ఈ ఏడాది కొత్త విన్యాసాలు నేర్చుకుని ప్రదర్శించేందుకు సిద్ధంగా ఉన్నా.

మాధవస్వామి ఆలయ హుండీ ధ్వంసం

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరు శివారులోని శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి మారబండ మాధవస్వామి ఆలయం హుండీని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని కానుకలు అపహరించినట్లు ఆలయ పురోహితుడు హరికృష్ణ పేర్కొన్నారు. రోజులాగే శుక్రవారం దీపారాధన కోసం అలయానికి వెళ్లగా హుండీ ధ్వంసం చేసినట్లు గుర్తించామన్నారు. పోలీసులు, దేవాదాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఐదుగురిపై కేసు నమోదు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నిరంజన్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కురువ నాగన్న ఇంటి వద్ద ఖాళీ స్థలంలో పాతిపెట్టిన బండలను అదే గ్రామానికి చెందిన సిరికి రాజు, విక్రమ్, రవి, గిరి, రామాంజితోపాటు మరికొందరు పగులగొట్టి రూ.5 వేల నష్టం చేశారని ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. దాంతో ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్రీమఠంలో బంగారు పల్లకి సేవ

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయం శ్రీమఠంలో శుక్రవారం బంగారు పల్లకి సేవ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాఘవేంద్రస్వామి వెండి బృందావనం, బంగారు పల్లకి సేవలో పాల్గొన్నారు. మఠంలో బృందావనానికి నిర్మాల్యం, పంచామృతాభిషేకం నిర్వహించారు.

హిందూపురం ఎంపీ పూజలు

మంత్రాలయం, న్యూస్‌టుడే: హిందూపురం ఎంపీ పార్థసారథి దంపతులు శుక్రవారం మంత్రాలయం చేరుకుని గ్రామదేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు.

కష్టపడి చదివితే లక్ష్య సాధన


విద్యార్థిని అభినందిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కష్టపడి చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చని పద్మశాలీ బహూత్తమ సంఘం, పద్మశాలీ యువజన సంఘం నాయకులు విశ్వనాథ్ రమేశ్, పోలె వీరప్రసాద్ అన్నారు. నీట్‌లో ర్యాంకు సాధించి తిరుపతి, నంద్యాల వైద్య కళాశాలల్లో సీటు సాధించిన ఎమ్మిగనూరుకు చెందిన సాత్విక్, నేహాలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, భీమేశ్, శివదాస్, విశ్వనాథం రాము, రవి, శ్రీనివాసులు, నాగరాజు, నరేష్, ఉరుకుందు, శ్రీరామ్, సుధాకర్, ఉదయ్ పాల్గొన్నారు.

సరకుల ధరలు పెంచితే కేసులు నమోదు

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే: దసరా పండగ నేపథ్యంలో నిత్యావసర సరకుల ధరలు పెంచకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మల్లికార్జున స్వామి అన్నారు. శుక్రవారం ఆయన కౌతాళంలోని కిరాణ, కూరగాయల దుకాణాల్లో నిత్యావసర సరకుల ధరలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా వంటనూనె, టమాటా తదితర వస్తువుల ధరలపై ఆరా తీశారు. పండగ పూట అధిక ధరలకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.


కిరాణ సరకులు పరిశీలిస్తున్న తహసీల్దార్ మల్లికార్జున స్వామి

కోసిగిలో....

కోసిగి, న్యూస్‌టుడే: కూరగాయల మార్కెట్‌లో నిర్ణయించిన ధరలకే కూరగాయలు అమ్మాలని తహసీల్దార్ నిత్యానందరాజ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం తహసీల్దార్ నిత్యానంద రాజు పేర్కొన్నారు. స్థానిక కూరగాయల మార్కెట్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలు టమాటా కిలో రూ.42, వంకాయ రూ.52, బెండకాయ రూ.42, మిరపకాయ రూ.22, కాకరకాయలు రూ.38, బీరకాయలు 42, క్యాలీఫ్లవర్ రూ.62, క్యాబేజీ రూ.32కు విక్రయించాలన్నారు. ఇదే ధరలు కొనసాగించాలన్నారు.

వృత్తి విద్యా నైపుణ్యాలు భవిష్యత్తుకు బాటలు


ఎమ్మిగనూరులో శిక్షణ తీసుకుంటున్న రచ్చుమర్రి ఆదర్శ పాఠశాల విద్యార్థులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: వృత్తి విద్యా నైపుణ్యాలు విద్యార్థుల భవిష్యత్తుకు బాటలని ప్రధానాచార్యుడు ప్రసాద్ అన్నారు. మండలంలోని రచ్చుమర్రి ఆదర్శ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు 54 మంది, ఇంటర్ విద్యార్థులు 36 మంది ఎమ్మిగనూరులోని కంప్యూటర్స్, ఎలక్ట్రికల్స్ కేంద్రాల్లో నిపుణులతో శిక్షణ పొందారని పేర్కొన్నారు. వారికి ప్రభుత్వం నుంచి త్వరలో ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్యా శిక్షకులు పంపయ్య, రవిబాబు, ఇండస్ ఒకేషనల్ కోఆర్డినేటర్ కృష్ణచైతన్య పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తబ్రెజ్ హెచ్చరించారు. మండలంలోని గోరంట్ల గ్రామంలో శుక్రవారం ఆయన రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తులు, అక్రమంగా మద్యం విక్రయించేవారి ఇళ్లలో సోదాలు చేశారు. ఈశ్వరయ్య, చెరుకులపాడు మనోహర్ ఇళ్లలో మద్యాన్ని పట్టుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సైలు తిమ్మయ్య, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

లాక్రోస్ క్రీడలో బంగారు పతకం

కోసిగి, న్యూస్‌టుడే: సెప్టెంబరు 27 నుంచి 30 వరకు ఆగ్రాలో నిర్వహించిన జాతీయ స్థాయి లాక్రోస్ క్రీడలో కోసిగి మండలం దొడ్డి బెళగల్ గ్రామానికి చెందిన సందీప్ రాణించి బంగారు పతకం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని జియాన్‌కుమారి తెలిపారు. సందీప్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని సర్పంచి రామయ్య, ఐటీడీపీ సల్మాన్‌రాజు, విజేత యూత్ అసోసియేషన్ సభ్యులు, పీడీ శివ అభినందించారు.

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ : **సమస్య :** వినాయక ఘాట్ సమీపంలో, స్వామిరెడ్డి నగర్‌కు వెళ్లే దారిలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. **- స్థానికులు**

సమస్య : నిర్మల్ నగర్‌లో కాలువలు శుభ్రం చేయాలి. వ్యర్థాలు పేరుకుపోయాయి. **- సుధాకర్, భాస్కర్**

సమాధానం: సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తాం.

- నగరపాలక సంస్థ అధికారులు

దుస్తుల పంపిణీ

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ వరద సహాయక చర్యల్లో 200 మంది నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులు గత నెలలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున వస్త్రాలను విజయవాడ నగరపాలక సంస్థ పంపింది. వాటిని నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డా.విశ్వేశ్వరరెడ్డి కార్మికులకు శుక్రవారం అందజేశారు.

ఉద్యోగుల పాత్ర కీలకం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: తపాలా పథకాలు ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని కర్నూలు డివిజన్ తపాలా శాఖ ప్రధాన పర్యవేక్షకుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కర్నూలు తపాలా ప్రధాన కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతిఒక్కరూ తమ విధులను నిబద్ధతతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ అధికారులు నూరుల్లా, విజయమోహన్‌రావు, కర్నూలు పోస్ట్‌మాస్టర్ పి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జన ఊరేగింపులో డీజేల నిషేధం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నగరంలో ఈనెల 13న జరిగే దుర్గా మాత విగ్రహాల నిమజ్జన ఊరేగింపు కార్యక్రమంలో డీజేలు, ఇతర తీవ్ర శబ్దాల వాయిద్యాలు ఉపయోగించడం నిషేధమని కర్నూలు రెండో పట్టణ సీఐ నాగరాజరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఊరేగింపు కొనసాగే మార్గంలో ఆసుపత్రులు ఉండటంతో ఈ ఆంక్షలు కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు సంకల్‌బాగ్‌లోని తుంగభద్ర నది దుర్గాఘాట్‌లో నిమజ్జనం మొదలవుతుందన్నారు. విగ్రహ నిర్వాహకులు నిబంధనలు పాటించి సహకరించాలని కోరారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్సు హాలులో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఐసీడీఎస్ పీడీ లక్ష్మమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మాయిలను చదువుకు దూరం చేయొద్దని కోరారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై గ్రామాల్లో పెద్దఎత్తున అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు. బాలికల తల్లిదండ్రులను చైతన్యవంతులను చేయాలని అధికారులను ఆదేశించారు. పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస ఆచారి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరలకే నూనె విక్రయాలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దుకాణాల వద్ద రాయితీపై వంట నూనెల విక్రయాలు చేపట్టినట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. కర్నూలు సి.క్యాంపులోని రైతుబజార్‌లో పామాయిల్ ప్యాకెట్ రూ.110, సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ రూ.124కు ఇచ్చే విక్రయ కేంద్రాన్ని పాణ్యం ఎమ్మెల్యే, జేసీ డా.బి.నవ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజా రఘువీర్, అర్బన్ ఏఎస్‌వో రామాంజనేయరెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూనె ప్యాకెట్ అందజేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జేసీ డా.బి.నవ్య

మహిళల్లో ఆర్థరైటిస్ సమస్య తీవ్రం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : మహిళల్లో ఆర్థరైటిస్ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని.. మోకాళ్లు, చేతులు, కీళ్ల నొప్పులతో బాధపడేవారు ప్రాథమిక స్థాయిలోనే చికిత్స చేయించుకోవాలని మెడికవర్ ఆసుపత్రి రుమటాలజిస్ట్ డాక్టర్ సృజన అన్నారు. ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సాధారణంగా 65 ఏళ్లు దాటినవారిలో ఆర్థరైటిస్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం జీవనశైలిలో మార్పుల కారణంగా చిన్న వయస్సులోనే సమస్యలు వస్తున్నాయని చెప్పారు. దేశంలో సుమారు 18 కోట్ల మంది ఈ సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

గార్లదిన్నె, న్యూస్‌టుడే : గార్లదిన్నె మండలంలోని తిమ్మంపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత రోడ్డు ప్రమాదం జరిగింది. బస్సు డ్రైవరు అప్రమత్తతతో భారీ ప్రమాదం తప్పింది. తెలంగాణ రాష్ట్రం జహీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 52 మంది ప్రయాణికులతో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. ఈక్రమంలో హైదరాబాదు నుంచి బెంగళూరుకు బెల్లం పాకు లోడుతో వెళ్తున్న ట్యాంకరును డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో తిమ్మంపేట సమీపంలో బస్సు ముందు భాగాన్ని ఢీకొంది. ఈ ఘటనతో బస్సు బోల్తా పడింది. బస్సులో ప్రయాణిస్తున్న కర్నూలు జిల్లా లక్ష్మీపురానికి చెందిన గురుమూర్తి, బస్సు డ్రైవరు రాము, ట్యాంకరు డ్రైవరుతోపాటు మొత్తం 12 మందికి గాయాలయ్యాయి. వీరిని అత్యవసర చికిత్స కోసం పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరి కొంత మందిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయుధ పూజ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : దసరా పండగను పురస్కరించుకుని నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. ఎస్పీ జి.బిందుమాధవ్ దంపతులు



పూజలు చేస్తున్న ఎస్పీ దంపతులు

ఆయుధశాలలో దుర్గామాత చిత్రపటానికి విశేష పూజలు చేశారు. పోలీసు వాహనాలు, ఆయుధాలు, ఇతర ఉపకరణాలకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డు దళాధిపతి ఎం.మహేష్‌కుమార్, కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచి సీఐ ప్రసాద్, ఆర్ఐలు నారాయణ, సోమశేఖర్‌నాయక్, జావెద్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పండగ వేళ.. స్టైల్ దండిగా!



కుర్రకారంటే.. సొగసరులు, సోగాళ్లు... వాళ్ల స్టైల్‌కి మరిన్ని మెరుపులద్దే సందర్భాలు వచ్చేశాయి! కాకపోతే ఈసారి సంప్రదాయంతో చెలరేగిపోవాలి. ఇప్పుడు చెప్పబోతున్నది దసరా, దీపావళి గురించి అని మీకీపాటికే అర్థమై ఉంటుందిగా! చక్కనమ్మలు, చక్కనయ్యలు.. అయితే పదండి.. ఈ పండగల వేళ ఎలా మెరిసిపోవాలో తెలుసుకుందాం..



పండగని శ్రద్ధగా జరిపించేది పెద్దలైతే.. సందడి మాత్రం యూత్‌దే. ఆధునికతకు అంబాసిడర్లు అయిన జనరేషన్ జడ్ ఆ వేళ మాత్రం బుద్ధిమంతుల్లా సంప్రదాయ దుస్తుల్లో ఒదిగిపోతారు. అమ్మాయిలు పట్టు పావడాలు, చీరకట్టుల్లో ముస్తాబైతే.. అబ్బాయిలు పంచెకట్టుకి జై కొడుతుంటారు. మరి ఈసారి దసరా, దీపావళికి డబుల్ ధమాకాలా వెలిగిపోవాలంటే ఈ సొగసు సూత్రాలు పాటించాల్సిందే.

అమ్మాయిలు సంప్రదాయంగా..

టీనేజీ, కాలేజీ అమ్మాయిలు నుంచి ప్రౌఢల వరకు పండగ వేళ ఆ కళ ఉట్టి పడటానికి పట్టుచీరలకే ఓటేస్తుంటారు. ఆ పట్టులో వాళ్లు కోరుకున్న రకాలు ఉండనే ఉంటాయి. ఎరుపు, ఆకుపచ్చ, పసుపు.. ఇలాంటి వర్ణాల చీరలకు జతగా క్లాసిక్ రవికెలు ధరించి, వాటికి తగ్గట్టుగా ఆభరణాలు వేసుకుంటే మహాలక్ష్మిలా మెరిసిపోవడం ఖాయం. సౌకర్యంగా ఉండాలి.. స్టైల్‌గా కనిపించాలి.. సంప్రదాయం అనిపించుకోవాలి అని భావించే చక్కనమ్మలు అనార్కలీ సూట్‌కే ఓటేయొచ్చు. వీటికి కాస్త ఎంబ్రాయిడరీ తళుకులు అద్దితే పండగవేళ అందరి చూపూ మీపైనే పడుతుంది. అందులోనూ ఎరుపు, ఆరెంజ్, రాయల్ బ్లూ రంగులైతే మరింత హుందాగా ఉంటాయి. అన్నట్టు ఈ స్టైల్‌కి జుంకాలు పెట్టుకుంటే కాంబినేషన్ అదిరిపోతుంది. సంప్రదాయం, సౌకర్యం రెండూ ఉండాలి అని భావించే భామలు కుర్తాలు ఎంచుకోవచ్చు.

ఈ సమయంలో క్రేప్స్, ఫ్లేర్డ్, గౌనులా పొడవాటివి ధరిస్తే అందంగా, హుందాగా ఉంటాయి. వీటికి జతగా పలాజో ప్యాంట్లు, రంగురంగుల దుపట్టాలు వేశారంటే పండగని ఒంటికి చుట్టుకున్నట్టే ఉంటుంది. సందడితో పండగకి ఎన్నో తెచ్చే పడుచు ప్రాయులకు లెహెంగా, చోళీ మంచి ఎంపిక. అచ్చ తెలుగు అమ్మాయిలైతే లంగా, ఓణీలు పేవరేట్. అందులోనూ ఎంబ్రాయిడరీ చేసినవైతే సంప్రదాయ సింగారంలా ఉంటాయి. మరింత రిచ్‌గా కనిపించాలనుకుంటే గ్రాండ్ చోళీలు ఎంచుకోవాలి. ఈ స్టైల్ దుస్తులతోపాటు ముత్యాల హారాలు, వరుసల నెక్లెస్‌లు, స్టేట్‌మెంట్ చెవిరింగులు, పెద్ద పరిమాణంలో ఉండే కఫ్‌లు, దండ కడియాలు ధరిస్తే సొగసులకు నిండుదనం వస్తుంది.

అబ్బాయిలు రాజసం..

అమ్మాయిలతో పోలిస్తే అబ్బాయిలకు పెస్టివల్ వార్డ్‌రోబ్‌ని రకరకాల స్టైల్స్‌తో నింపేయడానికి అవకాశం తక్కువే. అయినా ఉన్నవాటితో ప్రయోగాలు చేస్తూ ఎంచక్కా 'దసరా వచ్చిందయ్యా.. సరదా తెచ్చిందయ్యా..' అంటూ పాడుకోవచ్చు. పండగ అనగానే ప్రతి కుర్రాడికీ గుర్తొచ్చేది కుర్తా పైజామాలే. వీటిపై నెహ్రూ కోట్ ధరించారంటే దీపావళి మతాబులా వెలిగిపోవచ్చు. పైగా ఇవి సంప్రదాయానికి ప్రతీక. ధోతీ ప్యాంట్లు సైతం పండగలు, శుభకార్యాల్లో మగానుభావుల ఎంపికలో ముందుంటున్నాయి. టీనేజీ కుర్రాళ్ల నుంచి మధ్య వయస్కులదాకా ఎవరైనా వీటితో ముస్తాబు కావచ్చు. సాధారణంగా పెళ్లిళ్లలో ఎక్కువగా ధరించే షేర్వాణీలను ఈ దసరా, దీపావళికి కూడా వేసుకుంటే రాజసం ఉట్టిపడుతుంది. ఇందులోనూ ఎంబ్రాయిడరీ చేసినవైతే మరింత రిచ్‌గా కనిపిస్తాయి. వీటికి జతగా లేత రంగు బాటమ్‌వేర్ ధరించారంటే ఆకర్షణ రెట్టింపవుతుంది. ఫ్యాబ్రిక్ విషయానికొస్తే అమ్మాయి, అబ్బాయి అనే తేడా లేకుండా.. ఎవరైనా సిల్క్స్, కాటన్, చిఫాన్, జార్జెట్‌ని ట్రై చేయొచ్చు. కొట్టొచ్చినట్టు కనిపించాలంటే మాత్రం ముదురు వర్ణాలను ఎంచుకోవాలని ఫ్యాషన్ గురూలు చెబుతున్నారు.



ప్రయోగాలకు బోలెడు అవకాశాలు

దసరా, దీపావళి పండగలంటే మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు. ఈ సమయంలోనూ స్టైల్‌తో ఎన్నో ప్రయోగాలు చేయొచ్చు. సిల్క్స్, ఖాదీ, కలంకారీ, చేనేత కాటన్ ఫ్యాబ్రిక్ అనువుగా ఉంటాయి. వీటితో సౌకర్యం, హుందాతనం రెండూనూ. రెడ్, పీకాక్ బ్లూ/గ్రీన్, రాయల్ బ్లూ రంగులు సొగసులకి ద్విగుణీకృతం చేస్తాయి. అమ్మాయిలకు పట్టు చీరలు, కుర్తీలు ఎవర్‌గ్రీన్ స్టైల్. ధోతీ లుక్, లాంగ్ కుర్తాలు లేదా కుర్తాలకు జతగా మోజారీలను అబ్బాయిలు వేసుకోవచ్చు. మెటల్ లేదా లెదర్ స్ట్రాప్ వాచీలు ధరిస్తే హుందాగా కనిపిస్తారు.

– షణ్మిత, ఫ్యాషన్ డిజైనర్

థియేటర్‌లో.. హీరోల్లా..!

హీరో తెరపై విలన్‌తో ఫైటింగ్ చేస్తుంటే.. మనమే అతన్ని చితక్కొడుతున్నట్టు సీట్లో ఎగిరెగిరి పడతాం. హీరోయిన్‌తో డ్యూయెట్ పాడుతుంటే.. ఆ స్థానంలో మనల్ని ఊహించుకొని మెలికలు తిరిగిపోతుంటాం. ఈలలు, చప్పట్లు.. అబ్బో మనం ప్రేక్షకుడు అన్న సంగతి మర్చిపోయి థియేటర్లోనే నవరసాలూ పండిస్తాం. సినిమాలో హీరో తన పాత్రలో లీనం అవుతాడో, లేదో తెలియదుగానీ ప్రేక్షకుడిగా అన్నీ రక్తి కట్టిస్తాం. అంతవరకు ఓకే అది శ్రుతి మించితేనే వస్తుంది చిక్కంతా. ఆ జరిగినప్పుడు 'మేం సినిమా చూడాలా.. మీ చిందుల్ని వీక్షించాలా' అని చిరాకు పడుతుంటారు మిగతా ప్రేక్షకులు. అందుకే మన భావావేశం ఇతరుల ఆక్రోశానికి గురి కాకుండా ఉండాలంటే 'థియేటర్ ఎటికెట్' పాటించాలి. అంటే 'రేసుగుర్రం' సినిమాలో శ్రుతి హాసన్‌లా భావోద్వేగాలను మనసులోనే అణుచుకొమ్మని కాదుగానీ.. చుట్టూ వందలమంది ఉన్నారని గుర్తుంచుకొని, వాళ్ల ఫీలింగ్స్‌ని అర్థం చేసుకొని ప్రవర్తిస్తే చాలు. హాలులో లైట్లు ఆర్పేసినా, టైటిల్స్ మొదలైనా.. కొందరు పక్కవాళ్లతో ముచ్చట్లు ఆపరు. ఇంకొందరైతే ఫోన్ కాల్స్ షురూ. ఆ కబుర్లకు ఎండ్ కార్డు వేయరు. ఆ మాత్రం దానికి థియేటరుదాకా వెళ్లడం ఎందుకు? జోరీగలా పక్కవాళ్లకు ఇబ్బంది కలిగించడం ఎందుకు?



ఇంతేనా... ముందు సీట్లపై కాళ్లు పెట్టడం, సెల్‌ఫోన్లో పెద్దగా మాట్లాడటం, పదేపదే లేచి అటూఇటూ తిరగడం.. వీటినే హీరోయిజంగా భావిస్తుంటారు కొందరు. తిన్నా, మాట్లాడినా అతి శబ్దమే ఇంకొందరు. 'పక్కవాళ్లకి ఇబ్బంది కలుగుతుందనే కామన్‌సెన్స్ కూడా ఉండదు' అని ఎంతమంది అనుకుంటారో! 'ఈ చేష్టలు కేవలం సినిమా చూడటమే కాదు. సమాజం పట్ల మనకున్న దృక్పథాన్ని తెలియజేస్తుంది' అంటారు మానసిక నిపుణులు. ఇతరుల ఫీలింగ్స్‌ని అర్థం చేసుకోలేకపోవడం, భావోద్వేగాలపై నియంత్రణ లేకపోవడం ఈ తరహా ప్రవర్తనకు కారణం అవుతుందంటారు. సమయానికి థియేటరుకి చేరుకోకపోవడం, సెల్‌ఫోన్ మ్యూట్‌లో పెట్టకపోవడం, సినిమా ఆడుతున్న సమయంలో మాట్లాడకపోడం, చాటింగ్ చేయకపోవడం, ఇతరులకు ఇబ్బంది కలగకుండా ప్రవర్తించడం.. ఇవి పాటిస్తే మీరే కాదు.. పక్కవాళ్లకీ సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది.

'సాఫ్ట్'గా పక్కన పెట్టేస్తున్నారు..

ఒకచేతిలో కూల్‌డ్రింక్, మరో చేతిలో పిజ్జా లేదా బర్గర్, ఆపై ఆడుతూ పాడుతూ గడిపే రోజులే నేటి యువతరానికి ఇష్టం. ఇది జనరేషన్ జడ్, మిలీనియల్స్ అనుకుంటే.. కానీ జంక్‌ఫుడ్, శీతలపానీయాల వాడకాన్ని గణనీయంగా తగ్గిస్తోంది ఇప్పటి యూత్. ఇది 'మింటెల్' అనే సంస్థ చేసిన అధ్యయనంలో తేలిన వాస్తవం. ఈతరం కుర్రకారులో 34 శాతం మంది మెరుగైన జీవనశైలి కోసం సాఫ్ట్‌డ్రింక్స్‌ని పక్కన పెట్టేస్తున్నారట. దాంతో వాటి అమ్మకాలు భారీగా తగ్గిపోతున్నాయి. చేసేదేం లేక ఆఫ్ సీజన్‌లో శీతల పానీయాల సంస్థలు ఎన్నో రాయితీలు ప్రకటిస్తున్నాయి. ఈ కాలం, ఆ కాలం అని తేడా లేకుండా అన్నికాలాల్లో దుమ్ము రేపే అమ్మకాలు కేవలం వేసవిలోనే పర్వాలేదన్నట్టుగా ఉంటున్నాయి. 'యువతలో ఎందుకీ మార్పు?' అంటే వాళ్లకి ఆరోగ్య స్పృహ పెరగడమే కారణం. యాడెడ్ షుగర్స్ పదార్థాలు, కూల్‌డ్రింక్స్ వాడకంతో ఊబకాయం, మెటబాలిక్ సిండ్రోమ్, ఇన్సులిన్ రెసిస్టెన్స్, గుండెజబ్బుల అవకాశం ఎక్కువ కావడంతో వాటిని పక్కన పెడుతున్నామని ఈ సర్వేలో యువత స్పష్టం చేశారు. ఆరోగ్య చిట్కాలు, మెరుగైన జీవనశైలి సూత్రాలు చెప్పే ఇన్‌ఫ్లుయెన్సర్లు సైతం కొంతమేర ప్రభావం చూపిస్తున్నారు. దీనికితోడు సాఫ్ట్‌డ్రింక్‌కి ప్రత్యామ్నాయంగా కొన్ని రెస్టారెంట్లు అల్లం ద్రావణం, టానిక్ వాటర్‌లాంటివి అందుబాటులో ఉంచుతున్నాయి. వెరసి, సాఫ్ట్‌డ్రింక్‌కి కుర్రజనం సాఫ్ట్‌గా దూరమవుతోంది.



సందర్భం

ఈఫిల్ టవరే.. భాగస్వామి!

'మనుషులు అర్థం చేసుకోవడానికి మాది మామూలు ప్రేమ కాదు.. అగ్నిలాగ స్వచ్ఛమైనది..' అంటున్నారు కొందరు. అలాగని ఆ ప్రేమను గుండెల్లోనే దాచుకోలేదు. చట్టప్రకారం పెళ్లాడి ఒక్కటయ్యారు. ఇంతకీ వాళ్లు ఎవర్ని ప్రేమించారా? ఎలా పెళ్లాడారో తెలుసుకుంటే ఆశ్చర్యపోవడం ఖాయం.



● ఎరికా లాబ్రీ అనే అమ్మడు పారిస్‌లోని ఈఫిల్ టవర్‌ని పెళ్లాడింది. పెళ్లికూతురిలా ముస్తాబై వచ్చి, తన దుపట్టాని టవర్‌లోని ఒక ఇనుప దిమ్మెకు చుట్టి సంప్రదాయబద్ధంగా పెళ్లాడింది. ఆ తర్వాత గాఢంగా ఓ ముద్దు కూడా పెట్టేసింది.


● ఆరోన్ చెర్వెనాక్ తన ఐఫోన్ వెనక వైపు ఒక బంగారు ఉంగరాన్ని అతికించి, దాన్ని తన వేలికి తొడుక్కొని పెళ్లి అయ్యిందనిపించాడు.

● మీర్సోన్ రోచా మోరాస్ అనే సుందరాంగి ఒక అందాలకి బొమ్మని వివాహం చేసుకుంది. 'ప్రాణం లేని బొమ్మకి మనుష్యుల మాదిరి మాటలు చెప్పటం తెలియదు. అందుకే దాన్ని నా భాగస్వామిగా చేసుకుంటున్నా' అంది. ఆ బొమ్మకి తన గుండెల్లోనే కాదు.. పడకగదిలోనూ స్థానం ఇచ్చింది రోచా.

● ఒక చెట్టుని పెళ్లికూతురిలా ముస్తాబు చేసి, బ్యాండు మేళంతో వేడుక చేస్తూ మరీ పెళ్లాడాడు రిచర్డ్ టోర్రెస్. చెట్టు కన్నా నిస్వార్థంగా తనకేదీ కనిపించలేదని అలా చేశాడు.

మట్టి వాసన.. మళ్లీ చూద్దామా?

ఎప్పుడెప్పుడు వీకెండ్ వస్తుందా.. ఎప్పుడెప్పుడు సెలవులు దొరుకుతాయా అని ఉద్యోగులు, కాలేజీ కుర్రోళ్లు ఎదురుచూస్తుంటారు. ఒకేలాంటివి కాకుండా విభిన్నంగా ఉండేలా కొత్త కొత్త ప్రదేశాల కోసం వెతికేందుకు జల్లెడ పడుతుంటారు. ఆ కోవలో తాజాగా యూత్ ఫేవరెట్ డెస్టినేషన్‌గా మారింది అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు సమీపంలోని 'దేశీయ ఎకో రిసార్ట్'. ఇది పూర్తిగా మట్టితో నిర్మించి, అలికిన గుమ్మాలతో కళకళలాడే చిన్న చిన్న నివాసాల సముదాయం. మన్యం వచ్చే పర్యాటకులకు అక్కడి సాధారణ జీవన విధానాన్ని రుచి చూపించాలనే ఆలోచనతో పురికి చెందిన యుగంధర్‌ కర్ దీనికి రూపమిచ్చారు. ఈ రిసార్టులోకి అడుగుపెట్టగానే మట్టివాసనలు మనకు పాత రోజులను గుర్తుచేస్తాయి. పిజ్జాలు, బర్గర్ల వంటి జంక్ ఫుడ్ కాకుండా సేంద్రియ కూరగాయలు, ధాన్యాలతో చేసిన ఆరోగ్యకరమైన భోజనం రారమ్మంటూ ఊరిస్తుంది. అంతేకాదు.. మట్టిపాత్రల తయారీ, బుట్టల తయారీ.. గ్రామాల చిన్నారులకు పర్యాటకులతో వివిధ అంశాలపై శిక్షణ కూడా ఇప్పిస్తుంటారు. ఇలా విభిన్నమైన అనుభూతిని పంచుతూ హైదరాబాద్, పుణె తదితర నగరాల నుంచి యువతను ఆకర్షిస్తోంది.



– ఉదయ్, ముంచంగిపుట్టు గ్రామీణం

దసరా.. ధరల దడదడ

☛ భారీగా పెరిగిన నిత్యావసరాలు, కూరగాయల ధరలు ☛ అధికారుల పర్యవేక్షణ శూన్యం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: నిత్యావసర ధరలు అమాంతం పెరిగిపోయాయి. కూరగాయల ధరలు మండిపోతున్నాయి.. దసరా పండగ నేపథ్యంలో సామాన్య, మధ్య తరగతి ప్రజలు సరుకులు కొనుగోలు చేయాలంటేనే భయపడుతున్నారు. వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి అమ్మకాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా జనం నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు కొనుగోలు చేయలేక పండగను ఆనందంగా జరుపుకోలేకపోతున్నారు.

బియ్యం ధరలకు రెక్కలు

ఉమ్మడి కర్నూలు జిల్లా విపణిలో సంద్యాల సోనామసూరి బియ్యం 25 కిలోల ప్యాకెట్ రూ.1,700 ఉంది.. ఈ లెక్కన పరిశీలిస్తే కిలో రూ.68కు విక్రయిస్తున్నారు. కర్నూలు సోనామసూరి రూ.1,600కు అమ్ముతున్నారు. గతంలో కిలో రూ.50 ఉండగా.. ప్రస్తుతం కిలోపై రూ.14 నుంచి రూ.18కు పెరిగింది.

సామాన్యులకు పప్పన్నం కష్టమే

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత 8 నెలలుగా కందిపప్పు ధరలు దిగిరావడం లేదు. పప్పుధాన్యాల కొరత నేపథ్యంలో ధరలు నియంత్రణలోకి రావడం లేదు. కిలో కందిబేడలు రూ.165-రూ.170 పలుకుతోంది.. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు ఆశించినంత కంది పప్పు సరఫరా చేశారు. దీంతో పేదలు పండగ పూట పప్పన్నం తినలేని పరిస్థితులు నెలకొన్నాయి.



సి.క్యాంపు రైతుబజారులో విక్రయాలు

నిత్యావసరాలు.. కూరగాయల ధరల వివరాలు (కిలో రూ.లలో)

కందిబేడలు	165-170
వెల్లుల్లి	400
వంకాయలు	40-50
ఆలు	100
ముల్లంగి బుడ్డలు	66
బీరకాయలు	44
క్యాబేజీ 1	30-35
నంద్యాల సోనామసూరి (25 కిలోలు)	1,700

వారంలోనే లీటరుపై రూ.10-15 పెరుగుదల

వంట నూనెలు జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. గత 20 రోజులుగా ధరలు పెరుగుతూనే ఉన్నాయి. గత వారం రోజులుగా పామాయిల్ లీటరుపై రూ.15, పొద్దుతిరుగుడు నూనె రూ.10-13 వరకు పెరిగింది. విదేశీ దిగుమతులపై కేంద్రం 20 శాతం సుంకం విధించడంతో 20 రోజుల కిందట ఆయిల్ కంపెనీలు ధరలు పెంచేశాయి. మరోవైపు పండగ నేపథ్యంలో ప్రస్తుతం వ్యాపారులు పెంచి అమ్ముతున్నారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిన నేపథ్యంలో ఆయిల్ కంపెనీలు పరిమాణం తగ్గించి 800, 850, 910 గ్రాములు.. ఇలా వివిధ రూపాల్లో ప్యాకెట్లను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పరిమాణం తగ్గించి ఇష్టారాజ్యంగా అమ్మకాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఉల్లి.. కన్నీళ్లు తెప్పించి

ఉల్లి.. వినియోగదారులకు కన్నీళ్లు తెప్పిస్తోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.40-50-60కు అమ్ముతున్నారు. జిల్లాలో నెల రోజుల కుపైగా సరకు విపణికి వస్తోంది. గత నెలలో లక్ష క్వింటాళ్లకు పైగా కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు సరకు వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లి గరిష్ఠ ధర రూ.3,829 పలికింది. బహిరంగ మార్కెట్‌లో మాత్రం సరకును బట్టి కిలో రూ.30-రూ.60కు అమ్ముతున్నారు. వ్యాపారులు వినియోగదారులకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

వెల్లుల్లి.. కొనలేం

వెల్లుల్లి ధరలకు రెక్కలొచ్చాయి. కిలో రూ.400 పలుకుతోంది. ఆగస్టులో కిలో రూ.200-రూ.250 ఉండగా.. నెలన్నరకే ధరలు రెండింతలైంది. వాస్తవానికి క్వింటా రూ.20 వేల నుంచి రూ.25 వేలకు హోల్‌సేల్ వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఆ లెక్కన కిలో రూ.200-250 పలుకుతుంది. విపణిలో మాత్రం వెల్లుల్లిని రెండు రకాల ధరలు.. కిలో రూ.340, రూ.400కు అమ్ముతున్నారు.

కూర గాయాలే..

నిత్యావసరాలు.. వంట నూనెలకు తోడు తామేం తక్కువ కాదన్నట్లు కూరగాయల ధరలకూ రెక్కలొచ్చాయి. ఇటు బహిరంగ మార్కెట్‌లోనూ.. అటు రైతు బజారులో ధరలు భగ్గుమంటున్నాయి. కర్నూలు సి.క్యాంపు రైతుబజారులో ధరల పట్టికలో ఉన్న ధరలకు విక్రయాలు చేయడం లేదు. తూకంలోనూ మోసం ఉంటోంది. అధికారులు పిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదు.

మురుగు కదలక.. దుర్గంధం వదలక

కర్నూలు బస్టాండ్ ప్రాంగణంలో మురుగునీరు నిలవడంతో భరింపరాని దుర్గంధం వస్తోంది. పలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు నిలిపే ప్రాంతంలో మురుగునీరు నిలిచి ఉండటంతో సమస్యలు ఎదురవుతున్నాయి.



– ఈనాడు, కర్నూలు

అదుపు తప్పితే కాలువలోకే

కల్లూరు చెన్నమ్మ కూడలి నుంచి హంద్రీ నది వంతెన వైపు వచ్చే సర్వీసు రహదారిలో కాలువపై రంధ్రం ఏర్పడింది. ఇసుప కడ్డీలు ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం రాకపోకలు సాగే ప్రాంతం కావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు విన్నవిస్తున్నారు.



– న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ



కరపత్రాలను విడుదల చేస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ తదితరులు

నవంబరు 10న ఉదయాస్తమాన సేవలు

కర్నూలు వి.క్యాంపు, నగరం, న్యూస్‌టుడే: నగరంలోని ఎగ్జిబిషన్ మైదానంలో నవంబరు 10న తేదీన శ్రీనివాసుడి ఉదయాస్తమాన సేవలు నిర్వహించనున్నట్లు సీతారామ కల్యాణ మహోత్సవ సమితి నాయకులు శుక్రవారం తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ శుక్రవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీతారామ కల్యాణ మహోత్సవ సమితి నాయకులు పాల్గొన్నారు.

ఇసుక సీజ్

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: కర్నూలు గ్రామీణ మండలం పంచలింగాల పరిసర ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 380 మెట్రిక్ టన్నుల ఇసుకను తాలూకా పోలీసులు, మైనింగ్, రెవెన్యూ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. తాలూకా సీఐ శ్రీధర్, ఎస్సై పీరయ్య, మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ కుమార్, వీఆర్వో మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆయుధ పూజ

ఓర్వకల్లు న్యూస్‌టుడే: ఓర్వకల్లు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం అర్బన్ సీఐ చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఆయుధాలకు పూజలు చేశారు. విజయదశమి నేపథ్యంలో అమ్మవారి చిత్రపటానికి పూజలు జరిపారు. ఎస్సై సునీల్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓర్పుతోనే విజయాలు సాధ్యం

కర్నూలు వి.క్యాంపు, న్యూస్‌టుడే: చెడుపై విజయం సాధించాలంటే సమయం పడుతుందని, అందుకే ఓపిక ఎంతో అవసరమని ఏపీ రాష్ట్రీయ స్వయం సేవక్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి జి.శ్రీనివాసరెడ్డి అన్నారు. కర్నూలు విద్యానగర్‌లోని మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాలను శుక్రవారం నిర్వహించారు. పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డా.వాసురెడ్డి, జి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి.శ్రీనివాసరెడ్డి



భరతమాత ఆలయంలో పూర్ణాహుతి కార్యక్రమం



విజయ గణపతి ఆలయంలో కుంకుమార్చనలో మహిళలు



హోమంలో పాల్గొన్న భక్తులు

జగన్మాత.. నమోస్తుతే



గణేశ్ నగర్ ఆలయంలో భక్తిగీతాల ఆలాపన



చౌడేశ్వరి ఆలయంలో..



సప్తగిరి నగర్‌లోని చౌడేశ్వరి ఆలయంలో మహాదుర్గ అలంకరణ



నిమిషాంబ ఆలయంలో మహిషాసురమర్దినిగా దర్శనం




వి.క్యాంపు: రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు

కర్నూలు నగరం, బీక్యాంపు, న్యూస్‌టుడే: కర్నూలులోని ప్రధాన ఆలయాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. దేవీ నవరాత్రులు చివరి దశకు చేరుకోవడంతో వివిధ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో కుంకుమార్చన, లలితా సహస్రనామావళి తదితరాలు జరిపారు. పాతబస్తీలోని లలితాపీఠం, కాళికాంబ, నిమిషాంబ ఆలయం, గీతా మందిరం, చిన్నఅమ్మవారిశాల తదితర ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆయుధ పూజలు జరిపారు.

అక్కాతమ్ముడిపై కేసు నమోదు



కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలుకు చెందిన శాంతిరాజు, అతని సోదరి నక్షత్రపై కర్నూలు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. నగర శివారులోని కోడుమూరు రోడ్డు హోసన్న మందిరం వద్ద ఉన్న రాజు, మరియమ్మ టీ దుకాణం నిర్వహిస్తున్నారు. నిందితుల వద్ద రాజు దంపతులు అప్పు తీసుకున్నారు. ఈ క్రమంలో వీరి మధ్య వివాదం నెలకొంది. గతంలో తాము నిర్వహించిన దుకాణాన్ని ఆక్రమించుకున్నారని, తన కుమారుడ్ని ఇంటి వద్దకు నిందితులు దౌర్జన్యంగా లాక్కొని దాడి చేశారని మరియమ్మ కర్నూలు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశారు.

దాడి చేసి నష్టం కలిగించారంటూ..

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలు కోడుమూరు రోడ్డులోని ఓ వంక్షన్ హాలు నిర్వాహకుడు వెంకటనారాయణ, కుమారుడు ఆనంద్‌నాయుడు, శేఖర్, శివనాయుడు, మరికొందరిపై నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద శుక్రవారం కేసు నమోదైంది. నిందితులు తమ దుకాణంపై దాడి చేసి నష్టం కలిగించడంతో పాటు గాయపరిచారని డీసెల్ నిర్వాహకుడు శాంతరాజు గురువారం పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశారు.

హత్యాయత్నం కేసు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులోని వేర్వేరు కాలనీలకు చెందిన రమణయ్య, రమణ, గంగాధర్‌తోపాటు మరోకరిపై కర్నూలు నాలుగో పట్టణ పోలీ సుస్టేషన్‌లో శుక్రవారం హత్యాయత్నం చట్టం కింద కేసు నమోదైంది. స్థల వివాదం నేపథ్యంలో నిందితులు హత్యాయత్నానికి పాల్పడి గాయపరిచినట్లు శరీన్‌నగర్‌కు చెందిన శ్రీనివాసరెడ్డి పిర్యాదు చేశారు.